
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.7, కనిష్ఠం 12.4
కామారెడ్డి
జిల్లా వార్తలు



సోమవారం 8 డిసెంబరు 2025



ఆలయంలో హోమం నిర్వహిస్తున్న పండితులు (ఇన్‌సెట్‌లో సరస్వతీ మాత)

కనుల పండువగా సరస్వతీ దేవి ఆలయ వార్షికోత్సవం

- ఆలయంలో యజ్ఞం, అమ్మ వారికి ప్రత్యేక పూజలు
- అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

కామారెడ్డి రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని అడ్లూర్ (ఇల్చిపూర్) శివారులో గల శ్రీ సరస్వతీ దేవి ఆలయ 9వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారులు గంగవరం ఆంజనేయ శర్మ అమ్మ వారికి అభిషేకం, అలంకరణ, కుంకుమార్చనలు, హారతి, ఓడి బియ్యం, తదితర పూజా కార్యక్రమాలను అంగరంగ వైభవంగా చేపట్టారు. భక్తులు అమ్మ వారిని దర్శించుకోవడానికి ఉదయం నుంచే ఆలయానికి అధిక సంఖ్యలో చేరుకోవడంతో ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. దీంతో భక్తులు అమ్మ వారిని దర్శించుకొని ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు పెద్ద ఎత్తున అన్న ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాత పార్శి కరుణశ్రీ విఠల్ పాటిల్ దంపతులు, సిద్దాగౌడ్, నారాయణరెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనకు రెండేళ్లు



జిల్లాలో 11,616 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాలకు మొదటి విడత కింద మొత్తం 11,616 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. ఒక్కో నియోజకవర్గానికి 3,500ల చొప్పున ఇళ్లు మంజూరయ్యాయి. కామారెడ్డి నియోజకవర్గంలో 3,419 ఇళ్లు మంజూరు కాగా ఇందులో గ్రౌండెడ్ 1,942, బేస్మిట్ లెవల్ 367, వాల్‌లెవల్ 17, రూఫ్‌కాస్ట్ 5 పూర్తి కాగా బ్యాలెన్స్ 81 ఉన్నాయి. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో 3,500 ఇళ్లు మంజూరు కాగా ఇందులో గ్రౌండెడ్ 1851, బెస్మిట్ లెవల్ 290, వాల్‌లెవల్ 32, రూఫ్‌కాస్ట్ 5 పూర్తి అయ్యాయి. జుక్కల్ నియోజకవర్గంలో 3,178 ఇళ్లు మంజూరు కాగా ఇందులో గ్రౌండెడ్ 1,160, బేస్మిట్ లెవల్ 275, వాల్‌లెవల్ 13, రూఫ్‌కాస్ట్ 14 పూర్తికాగా బ్యాలెన్స్ 322 ఉన్నాయి. బాన్సువాడ నియోజకవర్గంలో 1,650 మాత్రమే టార్గెట్ ఉండగా ఇందులో 1,519 ఇళ్లు మంజూరు కాగా గ్రౌండెడ్ 480, బెస్మిట్ లెవల్ 69, వాల్‌లెవల్ 3, రూఫ్‌కాస్ట్ 6 పూర్తికాగా బ్యాలెన్స్ 131 ఉన్నాయి.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకుంది. సంక్షేమ పథకాలను అమలు చేయగా ఇచ్చిన హామీలను ఒక్కక్కటిగా అమలు చేస్తూ వచ్చింది. జిల్లాలో అభివృద్ధి పనులకు అరకొర నిధులను కేటాయించింది. 22వ ప్యాకేజీ పనులకు నిధులు విడుదల చేయకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. పెద్దప్రాజెక్టలను మంజూరు చేయలేదు. ఏడాది కిందట జుక్కల్, ఎల్లారెడ్డి నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను మంజూరు చేసింది. దీని నిర్మాణానికైన నిధులు కేటాయించి పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

- సంక్షేమ పథకాలకు పెద్దపీట
- విజయవంతంగా ఉచిత బస్సు పథకం
- రెండేళ్లలో ఆరున్నర కోట్ల మంది మహిళల ప్రయాణం
- రైతులకు సన్నధాన్యం బోనస్
- 1.56 లక్షల విద్యుత్ కనెక్షన్‌లకు జీరో బిల్లు
- జిల్లాలో 11,616 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు
- జిల్లాకు రెండు ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల మంజూరు
- పనుల ప్రారంభంలో జాప్యం
- అభివృద్ధి పనులకు అంతంత మాత్రంగానే నిధులు

కామారెడ్డి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకుంది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వ సంవత్సర పాలనలో ప్రధానంగా సంక్షేమ పథకాల అమలుకై పెద్దపీట వేసింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వచ్చింది. రేవంత్ సర్కార్ సంక్షేమ పథకాలపై ప్రత్యేక దృష్టి సారించిందే తప్ప జిల్లాలో ప్రధాన ప్రాజెక్టలకు అభివృద్ధి పనులకు మాత్రం పూర్తిస్థాయిలో నిధులు కేటాయించలేకపోయింది. సంక్షేమ పథకాలను మాత్రం విజయవంతంగా అమలు చేశారు. రైతు రుణమాఫీ, బోనస్, ఉచిత బస్సు, ఉచిత విద్యుత్, మహాలక్ష్మీపథకాలను అమలు చేస్తున్నారు. జిల్లా అభివృద్ధికి సైతం నిధులు కేటాయించాలని అన్ని వర్గాలు కోరుతున్నాయి. ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు అవుతున్న సందర్భంగా ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా కలెక్టరేట్ ఎదుట తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ ఈనెల 9న చేపట్టేందుకు యంత్రాంగం చర్యలు తీసుకుంది.

ఉచిత బస్సు సౌకర్యాన్ని వినియోగించుకున్న 6.54 కోట్ల మంది మహిళలు

ఎన్నికల సమయంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పిస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. సరిగ్గా ఇదే సమయానికి కాంగ్రెస్ అధికారంలోకి రావడం మొట్టమొదటిగా మహాలక్ష్మీ పథకం కింద మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం పథకాన్ని 2023 డిసెంబరు 9న అమలులోకి తీసుకువచ్చారు. జిల్లాలోని కామారెడ్డి, బాన్సువాడ డిపోల పరిధిలో ఆర్టీసీ బస్సులు వివిధ జిల్లాలకు ప్రాంతాలకు వెళ్తుంటాయి. ఇందులో భాగంగా ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగులలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించింది. ఇలా రెండేళ్ల ప్రజా ప్రభుత్వ పాలనలో జిల్లాలో సుమారు 6.54కోట్ల మంది మహిళలు ఉచిత రవాణా సౌకర్యాన్ని వినియోగించుకున్నారు.దీని ద్వారా మహిళలకు రూ.120 కోట్ల లబ్ధి చేకూరింది. మహాలక్ష్మి పథకం ద్వారా జిల్లాలో మొదటి సంవత్సరం 1,43,899మంది వినియోగదారులకు 2,97,121 గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశారు. ప్రభుత్వం రూ.8.56 కోట్ల రాయితీని (మిగతా 8లో..)

అభివృద్ధికి పూర్తిస్థాయిలో కేటాయించని నిధులు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి రెండు సంవత్సరాలు కావస్తోంది. అయితే సంక్షేమ పథకాల అమలుపైనే ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందే తప్ప జిల్లాలోని పలు అభివృద్ధి పనులకు, ప్రాజెక్టుల పురోగతికి పూర్తిస్థాయిలో నిధులు కేటాయించలేకపోయింది. ప్రధానంగా జిల్లా ప్రజల ఎన్నో సంవత్సరాల కల అయిన 22వ ప్యాకేజీ పనులకు నిధులు రాకపోవడంతో ఎక్కడికక్కడే పనులు ఉండిపోయాయి. ఈ ప్యాకేజీ పనుల నిర్మాణానికి నిధులు కేటాయించాలని స్థానిక ప్రజాప్రతినిధులు పలుమార్లు ప్రభుత్వాన్ని విన్నవించడమే కాకుండా సంబంధిత శాఖ రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో సమీక్షలు జరిపారు. రాష్ట్ర ప్రభుత్వం చెప్పుకోదగ్గ పెద్దప్రాజెక్టలను రెండేళ్ల కాలంలో మంజూరు చేయలేదు. ఏడాది కిందట జుక్కల్, ఎల్లారెడ్డి నియోజకవర్గానికి యంగ్‌ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను మంజూరు చేసింది. ఈ రెసిడెన్షియల్ విద్యా సంస్థ పనుల నిర్మాణానికైన త్వరగా నిధులు మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్ట్ పనులు పూర్తి చేయాలని జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు.



నిజాంసాగర్ ప్రాజెక్టులో ప్రస్తుత నీటి మట్టం

నేటి నుంచి యాసంగి సాగుకు నిజాంసాగర్ నీటి విడుదల

నిజాంసాగర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ ప్రాజెక్టు కింద ఈ ఏడాది యాసంగి పంటలు సాగు చేయడానికి సోమవారం నుంచి నీటి పారుదల శాఖ ఎస్ఈ దక్షిణమూర్తి, ఈఈ సోలోమోన్ ప్రధాన కాలువలోకి నీటిని విడుదల చేయనున్నారు. ఈ ఏడాది యాసంగి సాగుకు 15వేల ఎకరాలకు నీటిని విడుదల చేయనున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టులో ప్రస్తుతం 1405 అడుగుల నీటి మట్టంతో, 17.802 టీఎంసీల నీరు నిల్వ ఉందని డిప్యూటీ ఈఈ ప్రవీణ్‌కుమార్ ఆదివారం తెలిపారు. ప్రధాన కాలువ ద్వారా నీరు విడుదల అవుతున్న నేపథ్యంలో పశువుల, గొర్రెల కాపరులు అప్రమత్తంగా ఉండాలని, ప్రధాన కాల్వ వెంట వెళ్లే నీటిని రైతులు వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని ఆయన సూచించారు. ప్రధాన కాలువ వెంట 800ల క్యూసెక్కుల నుంచి 1200ల క్యూసెక్కుల సాగు నీటిని విడుదల చేస్తామని ఆయన వివరించారు.

రెండో విడత బరిలో 3,161 మంది

- తేలిన రెండో విడత అభ్యర్థుల లెక్క
- సర్పంచ్‌ల స్థానాలకు 506 మంది
- వార్డు స్థానాలకు 2,655 మంది బరిలో ఉన్న అభ్యర్థులు
- అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు
- ముమ్మరం చేసిన ప్రచారం

రెండో విడత బరిలో నిలిచిన అభ్యర్థులు

మండలం పేరు	సర్పంచ్ స్థానాలు	పోటీలో ఉన్నవారు	ఏకగ్రీవాలు	వార్డు స్థానాలు	పోటీలో ఉన్నవారు	ఏకగ్రీవాలు
గాంధారి	29	102	16	109	501	257
లింగంపేట	27	109	14	148	512	194
మహమ్మద్‌నగర్	12	35	01	77	216	35
నాగిరెడ్డిపేట	21	76	06	129	385	103
నిజాంసాగర్	13	38	01	101	223	21
పిట్లం	25	71	01	203	454	27
ఎల్లారెడ్డి	26	75	05	106	364	139
మొత్తం	157	506	44	873	2655	776

కామారెడ్డి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా రెండో విడత బరిలో నిలిచే అభ్యర్థుల లెక్క తేలింది. సర్పంచ్, వార్డు స్థానాలకు 3,161 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఎన్నికల అధికారులు అభ్యర్థులకు గుర్తులను కేటాయించారు. సర్పంచ్ స్థానాలకు 506 మంది అభ్యర్థులు బరిలో నిలువగా వార్డు స్థానాలకు 2,655 మంది పోటీలో ఉన్నారు. ఇప్పటికే పల్లెల్లో మొదటి విడత ప్రచారం హోరాహోరీగా సాగుతుంది. ఇక రెండో విడత అభ్యర్థులు ఖరారు కావడంతో ఆ పల్లెలోను ప్రచార సందడి నెలకొంది.

ఏకగ్రీవాల జోరు

పంచాయతీ ఎన్నికల సందర్భంగా జిల్లాలో జోరుగా ఏకగ్రీవాలు అవుతున్నాయి. మొదటి, రెండు విడతల్లో 55 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అవడం విశేషం. మొదటి విడతలో ఇప్పటికే 11 పంచాయతీలు, 433 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. రెండో విడతలో రికార్డు స్థాయిలోనే పలు పంచాయతీలు, వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. 11 గ్రామ పంచాయితీలు, 776 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి.



మాక్ పరీక్షకు హాజరైన విద్యార్థులు

నవోదయ మాక్ పరీక్ష

బాన్సువాడ రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని సోమేశ్వర్ గ్రామ శివారులో గల బ్లూమింగ్ మైండ్స్ నవోదయ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం నవోదయ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు మాక్ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రవేశపరీక్షలో భయం లేకుండా ఆత్మ విశ్వాసంతో పరీక్షను రాసేలా ప్రేరణ కల్పించేందుకు కోచింగ్ సెంటర్‌లో పరీక్ష నిర్వహించడం జరిగిందన్నారు. ఈ పరీక్షకు 200లకు పైగా విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు.

మంజీరాలో ఈతకు వెళ్లి గురుకుల విద్యార్థి మృతి



అజయ్ మృతదేహం

నిజాంసాగర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ మండలం అచ్చంపేట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో సీఈసీలో విద్యాభాసం చేస్తున్న విద్యార్థి అజయ్(19) మంజీరా నదిలోకి వెళ్లి నీట మునిగి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. గురుకుల పాఠశాలకు చెందిన అజయ్, అవినాష్, ఆశీష్ అనే ముగ్గురు విద్యార్థులు కలిసి ఆదివారం మధ్యాహ్నం కళాశాల హాస్టల్ నుంచి ప్రధాన గేటు ద్వారా బయటకు వచ్చారు. వీరు మంజీరా నది వద్దకు వెళ్లి అక్కడ బట్టలు విప్పి స్నానాలు చేయడానికి నదిలోకి దిగారు. నీటిలోకి దిగిన అజయ్ ప్రమాదవశాత్తు నీట మునిగి మరణించగా అతడిని బయటకు తీసి బండపై పడుకో బెట్టి కళాశాల (మిగతా 8లో..)

అచ్చంపేట గురుకుల ఉపాధ్యాయుల సస్పెన్షన్

నిజాంసాగర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ మండలం అచ్చంపేట గురుకుల కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థి అజయ్ మంజీరాలో నీట మునిగి మృతి చెందిన సంఘటనపై గురుకుల ఉన్నతస్థాయి అధికారులు సీరియస్ అయ్యారు. కళాశాలలో ఆదివారం విధుల్లో ఉన్న ఉపాధ్యాయులైన రవికాంత్, లక్ష్మణ్‌లు విద్యార్థులపై పర్యవేక్షణ లేకపోవడం, విధుల నిర్లక్ష్యం వహించినందుకు సస్పెండ్ చేస్తు ఉత్తర్వులు జారీ చేశారు. కళాశాలలో జరిగిన ఈ సంఘటనపై పూర్తి విచారణ జరిపేందుకు ఉన్నత స్థాయి కమిటిని నియమించేందుకు ఉత్తర్వులు జారీచేయనున్నట్లు సమాచారం



బీఆర్‌ఎస్‌లో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న గంప గోవర్ధన్

కాంగ్రెస్ మద్దతుదారులను ఓడించాలి

మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

కామారెడ్డి టౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారులను తుక్కుతుక్కుగా ఓడిస్తేనే పథకాలు అమలు అవుతాయని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. ఆదివారం కామారెడ్డి పట్టణంలోని 19,22 వార్డ్‌లకు చెందిన యువకులు 30 మంది నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా (మిగతా 8లో..)

ట్రాఫిక్ సమస్య తీరేనా?

- జిల్లా కేంద్రంలో ఏళ్ల నుంచి ట్రాఫిక్ ఇబ్బందులు
- ఇటీవల పలు సెల్లార్‌లను మూసివేయించిన మునిసిపల్ అధికారులు
- రోడ్లపై కూర్చునే కూరగాయల వ్యాపారులను వీక్లీ మార్కెట్‌కు తరలింపు
- ఆ ప్రాంతం గుండా మెరుగైన ట్రాఫిక్ ఇబ్బందులు



సుభాష్‌రోడ్డులో కూరగాయల వ్యాపారాలతో కిక్కిరిసిన ట్రాఫిక్ (ఫైల్)

కామారెడ్డి టౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంగా మారినా పూర్తిస్థాయిలో అభివృద్ధికి నోచుకోవడం లేదు. రోజురోజుకూ మున్సిపల్ పరిధిలో గృహాలు, వ్యాపార సముదాయాలు పెరుగుతుండడంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారి వాహనాల రాకపోకలు పెద్దఎత్తున కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా తయారైంది. ప్రధాన రహదారులు విస్తరించకపోవడం, పార్కింగ్ స్థలాలు లేకపోవడం, ఆక్రమణలు, పార్కింగ్ స్థలాల్లో వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేయడంతో రోడ్లపైనే కొందరు వాహనాలు నిలుపుతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలమవుతోంది. ఇతర వాహనదారులకు ప్రయాణం నరకప్రాయంగా మారుతోంది. ఏళ్లుగా వేధిస్తున్న సమస్యలను పరిష్కారించేందుకు అధికారులు ఒక అడుగు ముందుకు వేస్తే ఎక్కడికక్కడ అడ్డంకులు రావడంతో నాలుగు అడుగులు వెనక్కి వేయాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇటీవల వ్యాపార సముదాయాల వద్ద సెల్లార్‌లను నిర్మించి వాటిలో షెటర్‌లు నిర్మించి అద్దెకు ఇవ్వడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తు వాటిని అధికారులు సీజ్ చేశారు. అదేవిధంగా కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి నుంచి సుభాష్‌రోడ్డు, తిలక్‌రోడ్డులలో ప్రతీ ఆదివారం కొనసాగే కూరగాయాల మార్కెట్‌తో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఏళ్ల నుంచి ట్రాఫిక్ ఇబ్బందులు

పల్లెల నుంచి వలసలతో కామారెడ్డి జిల్లాకేంద్రానికి జనాభా ఏటికేడు పెరుగుతూనే ఉంది. వీరితో పాటు ఇతర (మిగతా 8లో..)

కోవర్టుల కలవరం

- బాన్సువాడ మండలంలో సర్పంచ్ అభ్యర్థులకు గుబులు
- ఎవరిని నమ్మాలో.. ఎవరిని నమ్మొద్దో తెలియడం లేదు



బాన్సువాడ రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల వేడి బాన్సువాడ మండలంలోని కోనాపూర్, దేశాయిపేట్, సంగోజీవాడి, కొల్లూరు, నాగారం, బుడిమి, బోర్లం, కొత్తబాద్ గ్రామాల్లో పూర్తిగా ఎక్కెరెక్కింది. ప్రచార బాణాలు వెలుపల కనిపిస్తే గుప్తరాజకీయ కదలికలు లోపల అభ్యర్థులను కలవరపడుతున్నాయి. ఆయా గ్రామాల్లో సర్పంచ్‌గా పోటీ చేస్తున్న అభ్యర్థులకు తామే అన్ని రాకాలుగా అండగా ఉంటున్నామని పైకి చెబుతున్నప్పటికీ ప్రత్యర్థి పార్టీ బలపర్చిన అభ్యర్థులకు మాత్రం కొంతమంది లోలోపల మద్దతు కూడబెడుతూ తమకు కావాల్సిన సమాచారాన్ని ఇతర పార్టీలకు చెందిన అభ్యర్థులకు బలం, బలహీనతల కోసం తమకు చెందిన కొంత మంది కార్యకర్తలను ఇతర వర్గంలోకి చేర్పించి వారి సమాచారాన్ని రాబేట్టుందుకు కొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. కోవర్టు కార్యకర్తలు గ్రామాల్లో కీలకపాత్ర పోషిస్తున్నారు. పగలు ఓ అభ్యర్థికి రాత్రివేళ వాట్సప్ కాల్స్, సీక్రెట్ మీటింగ్స్ ద్వారా ప్రత్యర్థుల వ్యూహాలకు బలం చేకూరుస్తున్నారని సమాచారం.

కుల సంఘాలు, యువకులు అభ్యర్థులకు బలం చేకూర్చేనా?

గ్రామ పంచాయతీ సర్పంచ్‌కు పోటీ చేస్తున్న అభ్యర్థులు ఆయా గ్రామాల్లో కుల సంఘాల నాయకులు, యువకులతో సమావేశమై వారికి కావాల్సిన థాయిలాలు అందిస్తామని వారికి ప్రలోభాలకు గురి చేస్తూ ఎన్నికల్లో తమకు మద్దతు పలకడమే కాకుండా ఓట్లు వేయించాలని వారి చేత ప్రమాణాలు సైతం చేయిస్తున్నారు. స్థానికంగా ప్రభావశీలులైనా కొందరు యువత, కుల సంఘాల కీలక సభ్యులు గుట్టుచప్పుడు కాకుండా సమీకరణాలు మార్చడం, ఓటర్లపై ప్రభావం చూపడం గ్రామాల్లో చర్చనీయాంశంగా (మిగతా 8లో..)

క్రైం సమాచారం

వివాహిత అదృశ్యం

రామారెడ్డి, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని గిద్ద గ్రామానికి చెందిన ఓ వివాహిత అదృశ్యమైనట్లు ఎస్సై రాజశేఖర్ ఆదివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పెద్దోళ్ల రజిత(32) ఈ నెల 5న ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లలో, తెలిసిన వారి వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో భర్త సుధాకర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



పాఠశాల ఆవరణలో శ్రమదానం చేస్తున్న సంస్థ సభ్యులు

ఆర్మూర్‌లో స్వచ్ఛ భారత్

ఆర్మూర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాంమందిర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణ ఆదివారం మహాత్మా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలలో పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు చెట్ల కొమ్మలను తొలగించి శుభ్రం చేశారు. మధ్యాహ్న భోజనశాల పక్కన ఉన్న కులాయిల వద్ద చెత్తను తొలగించి మురికి నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు సుంకె శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు సిరిల్ రావు, ఉపాధ్యాయులు కొంగి మనోహర్, సంస్థ సభ్యులు ప్రశాంత్, రాజ్‌కుమార్, సుంకె నిశాంత్, నరేందర్, కుతాడి ఎల్లయ్య, రాకేష్, గణేష్, శ్యామ్‌సుందర్, భోజన్న తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులకు సూచనలు చేస్తున్న దృశ్యం

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

» జిల్లా ఎన్నికల పరిశీలకుడు శ్యామ్‌ప్రసాద్ లాల్

మోస్రా, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బోధన్ డివిజన్‌లో మొదటి విడత పంచాయతీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల పరిశీలకుడు శ్యామ్‌ప్రసాద్ లాల్ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో ఎన్నికల అధికారులకు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. సర్పంచ్ ఎన్నికల నిర్వహణపై అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఎన్నికల్లో ఎలాంటి తప్పులు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల నియమావళిని ప్రతీఒక్కరు పాటించాలని పేర్కొన్నారు. ఫలితాలను ప్రకటించడంతో పాటు ఉప సర్పంచ్ ఎన్నిక ప్రక్రియ పూర్తయ్యే వరకు అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీపీవో శ్రీనివాస్, తహసీల్దార్ రాజశేఖర్, ఎంపీడీవో శ్రీనివాస్,పంచాయతీ కార్యదర్శులు శ్రావణ్, రాజశేఖర్, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణం చేద్దాం రారండి..!

» ఆలయాల్లో వైభవంగా వేడుకలు

» తిథులు, నక్షత్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు

» పాలుపంచుకుంటున్న భక్తులు

నిజామాబాద్ కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కల్యాణం చూద్దాం రారండి... అని ఆలయాల్లో కల్యాణోత్సవాలప్పుడు వినిపించే పాటలు. కళ్యాణం చేద్దాం రారండి అని భక్తులు ఆలయాల్లో వినిపిస్తున్న మాటలు. ఆలయాల్లో కల్యాణోత్సవాలను నిర్వహించడం సంప్రదాయంగా వస్తుంది. గతంలో బ్రహ్మోత్సవాలు (జాతర) భాగంగా మాత్రమే కల్యాణం నిర్వహించేవారు. నేడు దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోని ఆలయాలతో పాటు పలు ఆలయాల్లో దేవతా నక్షత్రం, తిథి రోజున కల్యాణ వేడుకలు జరుపుతున్నారు. నిత్య కల్యాణం, పచ్చతోరణం అనే నానుడిని ఆలయాలు నిజం చేస్తూ వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ఆలయాలు కొత్త శోభను సంతరించుకుంటున్నాయి. ఆధ్యాత్మిక చైతన్యాన్ని వ్యాప్తి చెందిస్తున్నాయి.

ఆలయాల్లో మాసానికి ఒకసారి..

వైష్ణవ, శైవక్షేత్రాలు మాసానికొక కల్యాణానికి వేదిక అవుతున్నాయి. వైష్ణవ ఆలయాలైన సీతారామచంద్రస్వామి, లక్ష్మీనారసింహస్వామి, వెంకటేశ్వర స్వామి, శ్రీకృష్ణ ఆలయాల్లో ఆయా నక్షత్రాల్లో కల్యాణం నిర్వహిస్తుండగా.. శివాలయాల్లో మాసశివరాత్రి రోజు వేడుకలను జరుపుతున్నారు. సీతారామచంద్రస్వామి ఆలయంలో రాముని నక్షత్రమైన పునరవసు రోజున, లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో స్వాతి నక్షత్రం, వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రవణానక్షత్రం, సుబ్రహ్మణ్యస్వామి నక్షత్రమైన కృతిక, శ్రీకృష్ణ ఆలయంలో రోహిని నక్షత్రం రోజుల్లో కల్యాణం వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నారు. శ్రీవల్లి, దేవసేన సహిత సుబ్రహ్మణ్య స్వామికి కృతిక నక్షత్రం రోజు శివాలయాల్లో మాస శివరాత్రి పర్వదినాన్న సాయంత్రం వేడుకలను జరుపుతున్నారు.



సీతారాముల కల్యాణం

వేడుక ఏదైనా..

పుట్టిన రోజు, పెళ్లి రోజు , గృహాల్లో శుభకార్యక్రమాలు అయ్యే రోజుల్లో ఆలయాలకు వెళ్లి స్వామిని దర్శించుకొని అర్చన, హారతి, అభిషేకం, ఆర్జిత సేవల్లో పాలుపంచుకునే వారు. ఆలయాల్లో నేడు వేడుక ఏదైనా కల్యాణానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆర్జిత సేవలు ఎప్పుడైనా చేసుకోవచ్చని కల్యాణం నిర్వహిస్తే స్వామి అనుగ్రహంతో ఆనందంగా ఉంటామని భక్తులు భావిస్తున్నారు. గ్రహచారరీత్యా పెళ్లిళ్లు, సంతానం కాని వారు కల్యాణం నిర్వహిస్తే పెళ్లి, సంతానం కలుగుతుందని పండితులు పేర్కొనడంతో అందుకు భక్తులు సిద్ధమవుతున్నారు. ఆలయాల్లో జరిగే పలు అన్నదానాలు, ఇతర సేవలకు విరాళాలు అందజేస్తున్నారు.

మాస శివరాత్రి ప్రత్యేకం



శివుడికి ప్రీతికరమైన మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయంలో కల్యాణ వేడుకలను నిర్వహిస్తున్నాం. పదేళ్ల నుంచి ఆలయంలో 111 సార్లు ఉత్సవాలు నిర్వహించాం. ఆలయంలో అర్చన, అభిషేకం, హారతి, ఆర్జిత సేవలతో పాటు ప్రతినెలా కళ్యాణోత్సవాన్ని ఆర్జిత సేవగా చేపడుతున్నాం.

- రాములు, శంభులింగేశ్వర ఆలయ కార్యనిర్వహణాధికారి

శ్రవనానక్షత్రం రోజు వేడుకలు



శ్రీనివాసుడు జన్మించిన శ్రవనానక్షత్రం రోజున ఆలయంలో కల్యాణ వేడుకలను నిర్వహిస్తున్నాం. పుట్టినరోజు, పెళ్లి రోజుల్లో భక్తులు ముఖ్యమైన రోజుగా భావించి ఆలయంలో జరిగే కల్యాణ ఆర్జిత సేవలో పాలుపంచుకుంటారు. శ్రావణమాసం, కార్తీకమాసం, జెండా జాతర మాసాలలో అధిక సంఖ్యలో జంటలు వేడుకల్లో పాల్గొంటారు.

- వెలగలేటి నాగరాజచార్య, జెండాబాలాజీ ఆలయ అర్చకుడు

దోషం తొలగిపోతుంది



గ్రహాలు సరైన స్థానంలో లేనప్పుడు ఆలయాల్లో కళ్యాణం నిర్వహించడం శ్రేష్ఠమైనది. స్వామి వారి కల్యాణం జరిపిస్తే గ్రహచారరీత్యా దోషాలు తొలగిపోతాయి. ఆలయాల్లో ఆర్జిత సేవగా కల్యాణం జరిపిస్తున్నాం.

- మకరంద్ శాఖాయ్, నీలకంఠేశ్వర ఆలయ అర్చకుడు

పోలింగ్ ప్రక్రియ సజావుగా చేపట్టాలి

» బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ వికాస్ మహతో

కోటగిరి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోలింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో సూచించారు. కోటగిరి, పోతంగల్ మండలాల్లో ఆదివారం ప్రిసైడింగ్ అధికారులకు ఎన్నికల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ వికాస్ మహతో మాట్లాడుతూ 10వ తేదీన ఎన్నికల సామాగ్రిని స్వీకరించడంతో పాటు ఓటర్ల జాబితా, స్టాంపులు, వివిధ ఫారాలు ఇతర అవసరమైన అన్ని సామగ్రిని పూర్తిగా లెక్కించి ధ్రువీకరించుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తును సరిగా ఉండేలా ఎన్నికల అధికారులు చూసుకోవాలన్నారు. ఓటరు ఓటు వేసేటప్పుడు ఓటు గోప్యత కాపాడే విధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ అధికారులు ఓటర్ల గుర్తింపు, సిరా మార్కింగ్ స్పష్టంగా వివరించాలని సూచించారు. ఉదయం 7గంటల కల్లా పోలింగ్ ప్రక్రియ ప్రారంభించి ఒంటి గంటకు పూర్తి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రానికి వచ్చిన ఓటర్లకు చివరి క్షణం వరకు ఓటు వేసే అవకాశం కల్పించాలని సూచించారు. అనంతరం ఫలితాలను ప్రకటించడంతో పాటు ఉప సర్పంచ్ ఎన్నిక ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రిసైడింగ్ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంగాధర్, ఎంపీడీవో విష్ణు, చందర్, ఎంపీవో క్యాకప్ప, ఎన్నికల అధికారులు శంకర్, శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

» నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్

నవీపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల అధికారులు అప్రమత్తంగా ఉండాలని నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని ఉర్దూ మీడియం జడ్పీహెచ్ఎస్ ఆవరణలో ఆదివారం ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 11న జరిగే పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన 347 మంది ప్రిసైడింగ్ అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తును సరిగా ఉండేలా ఎన్నికల అధికారులు చూసుకోవాలన్నారు. ఎన్నికలు పకడ్బందీగా జరగడానికి అధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆర్డీవో వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగనాథ్, ఎంపీవో రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్



ఎన్నికల అధికారులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

జాగ్రత్తలు పాటించాలి

» అడిషనల్ కలెక్టర్ కిరణ్‌కుమార్

రుద్రూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికల్లో విధులు నిర్వర్తించే అధికారులు జాగ్రత్తలు పాటించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ కిరణ్ కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆదివారం ఎన్నికల అధికారులకు శిక్షణ తరగతులను ఏర్పాటు చేశారు. ఎన్నికలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అడిషనల్ కలెక్టర్ కిరణ్‌కుమార్ అవగాహన కల్పించారు. ఎవరికి తలొగ్గకుండా ఎన్నికలు సజావుగా సాగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాలగంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



కాంగ్రెస్‌లో చేరిన నాయకులతో ముత్యాల సునీల్

భీమ్‌గల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రానికి చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ మేరకు వారికి సునీల్ కుమార్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు ఈ సందర్భంగా వారు తెలిపారు. కార్యక్రమంలో మండల, పట్టణ అధ్యక్షులు స్వామి, జేజే నర్సయ్య, నాయకులు సురేందర్, లక్ష్మణ్, వాక మహేష్, శ్యామ్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న జాతర



ఆలూర్‌లో ఖండేరాయుడు మల్లన్న రథం లాగుతున్న భక్తులు

ఆలూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండల కేంద్రంలో ఆదివారం ఖండేరాయుడి (మల్లన్న) జాతరను భక్తులు ఘనంగా నిర్వహించారు. భక్తులు బోనాలు, డప్పుచప్పుళ్లతో మొక్కులను సమర్పించారు. బెల్లంతో తులాభారాలను నిర్వహించారు. సాయంత్రం సమయంలో మల్లన్న దేవుడికి సంబంధించిన రథం లాగుతూ ఉత్సాహంగా దేవుడిపై తమ భక్తిని చాటుకున్నారు. జాతరకు సంబంధించిన భక్తుల అవసరాల నిమిత్తం గ్రామాభివృద్ధి కమిటీ వారు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా డిసెంబర్ 14వ తేదీన చిన్న జాతరను నిర్వహించినట్లుగా తెలిపారు.

రెండో రోజుకు భీమన్న ఉత్సవాలు



గంగస్నానానికి గజాలను తీసుకెళ్తున్న నాయక్‌పోడ్ కులస్థులు

మెండోరా, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని భీమన్న ఉత్సవాలు 2వ రోజు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం భీమన్న దేవుని గజాలను గ్రామ వీధుల గుండా తప్పెట్ల చప్పుళ్లతో మహిళల మంగళ హారతులతో ఊరేగిస్తూ పవిత్ర పుణ్యక్షేత్రం గోదావరి నది స్నానానికి బయల్దేరి వెళ్లారు. సాయంత్రం గజాలు భీమన్న ఆలయానికి చేరుకున్నాయి. సోమవారం వేకువ జామున భీమన్న దేవుని కల్యాణం, నాగెల్లి, అగ్నిగుండం కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆదివాసీ నాయక్‌పోడ్ కులస్థులు తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయక్‌పోడ్ కులస్థులు పాల్గొన్నారు.

చిట్టి చిలకమ్మా.. కల్లు తాగావా..

బహుశా కలి కాలం ఇంటే ఇదేనేమో. చెట్ల కల్లు (తాటి, ఈత)ను సేవించడానికి ప్రజలు ప్రస్తుతం కాలంలో ముందుకు రాడం తక్కువే. ప్రతీ ఒక్కరు బీరు, విస్కీలకే అలవాటు పడుతున్నారు. ఇటువంటి తరుణంలో నందిపేట మండలంలోని లక్కంపల్లి గ్రామ శివారులో ఉన్న ఈత చెట్టుకు వస్తున్న కల్లును ప్రతీ రోజు రామ చిలుక సేవిస్తోంది. తన దాహర్తిని తీర్చుకొంటుంది.

- నందిపేట



18 స్థానాలకు 70 మంది పోటీ

» జక్రాన్‌పల్లి మండలంలో మూడు సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం

» మిగతా చోట్ల పోరు రసవత్తరం

జక్రాన్‌పల్లి , డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలు రసవత్తరంగా సాగుతున్నాయి. రిజర్వేషన్లు కలిసివచ్చిన స్థానాల్లో పదుల సంఖ్యలో సర్పంచ్ సీటు కోసం బరిలో నిలుస్తున్నారు. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలంలో 21 గ్రామ పంచాయతీలు ఉండగా ఇందులో మునిపల్లి, మనోహరబాద్, నల్లగుట్ట తాండ గ్రామ సర్పంచ్‌లు ఎం. చిన్నసాయిరెడ్డి, అల్లూరి లక్ష్మీ, బనతో ప్రమీలా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇక మిగతా 18 గ్రామాల సర్పంచ్ స్థానాలకు 70 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అర్గుల్ సర్పంచ్ స్థానానికి 8 మంది అభ్యర్థులు, బలనగర్‌లో 3, బ్రాహ్మన్‌పల్లిలో 9 మంది, చందమీయ బాగుతాండలో 2, చింతలూర్‌లో 2, గన్యతాండలో 2, జక్రాన్‌పల్లిలో 3, కలిగోట్‌లో 8 మంది, కేశ్‌పల్లిలో 2, కొలిప్యాక్‌లో 4, లక్ష్మాపూర్‌లో 3, మాదాపూర్‌లో 2, నారాయణపేట్‌లో 2, పడకల్‌లో 4, పుప్పాల పల్లిలో 5, సికింద్రాపూర్‌లో 4, తొర్లికొండలో 4, వివేకనగర్ తాండ 3 అభ్యర్థులు పోటీలో ఉన్నారు. మండలంలోని ఈ ప్రాంతాల్లో పోరు రసవత్తంగా ఉండనుంది. మరి ఇందులో ఎవరు గెలుస్తారనేది వేచి చూడాలి.

రెండేళ్లలో ఆర్మూర్ అంధకారమయం

» మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లాధ్యక్షుడు జీవన్‌రెడ్డి



బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను స్ర్కీన్‌పై చూపిస్తున్న మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ఆర్మూర్ టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గడిచిన పదేళ్ల కాలంలో ఆర్మూర్ నియోజకవర్గం స్వర్ణయుగంగా వెలిసిందని, గత రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో నియోజకవర్గం అంధకారమైందని కాంగ్రెస్, బీజేపీల పుణ్యమా అని అంతా అవినీతిమయం అవుతూ అభివృద్ధిమయమైందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలోని జీవన్‌రెడ్డి ఇంట్లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్, బీజేపీ పార్టీలు అణాపైసా నిధులు తేలేదని, కాంగ్రెస్ ఇన్‌చార్జి పీసీఆర్ అవినీతిలో ముందున్నారని, బీజేపీ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి అభివృద్ధిలో ఫ్లాప్ అయ్యారని విమర్శించారు. బీఆర్ఎస్ పథకాలను తామే తెచ్చామని కాంగ్రెస్ గోబెల్స్ ప్రచారం చేస్తుందని అన్నారు. రూ.3 వేల కోట్లతో నియోజకవర్గాన్ని తీర్చిదిద్దానని 100 పడకల ఆసుపత్రి, రెవెన్యూ డివిజన్, రూ.20 కోట్లతో సిద్దుల గుట్టకు ఘాట్‌రోడ్డు, రూ.150 కోట్లతో పంచగూడ వంతెన నిర్మాణం, బైపాస్ రోడ్లనిర్మాణంతో పాటు అన్ని సామాజిక వర్గాలకు కమ్యూనిటీ హాల్‌ల నిర్మాణం చేపట్టామన్నారు. నియోజకవర్గంలో రోడ్డు లేని ఊరుందా అని ప్రశ్నించారు. తమ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను స్ర్కీన్‌పై ప్రదర్శించారు. రెండేళ్లలో నియోజక అభివృద్ధి ఆమడదూరం పోయిందని ప్రజల బాధలు పట్టని నాయకులు ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీల అవినీతి అక్రమాలకు, తప్పుడు పనులకు జనతా గ్యారేజ్‌లో రిపేర్ చేస్తానని హెచ్చరించారు. జిల్లా అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని నిధులు ఇచ్చిందో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అభివృద్ధిపై పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్, సీనియర్ నాయకులు పోల సుదాకర్, రాజేశ్వర్‌రెడ్డి, మీరా శ్రావణ్, పృథ్వీ, గణేష్, హజీమ్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పడిపూజ



అయ్యప్ప స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

బోధన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఓం ఓం అయ్యప్ప.. శరణం.. శరణం అయ్యప్ప అంటూ శరణు ఘోషతో అయ్యప్ప పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం బోధన్ పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో పడిపూజ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు సంతోష్ శర్మ మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప స్వామి ఆలయంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు, ఇందూర్ హైస్కూల్ కరస్పాండెంట్ కొడాలి కిషోర్ సమక్షంలో స్వామి పడిపూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములు 18 మెట్లను పూలతో అందంగా అలంకరించి పుష్పార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుస్వాములు, అయ్యప్ప స్వాములు అధిక సంఖ్యలో హాజరై అయ్యప్ప స్వామి భజనలు, కీర్తనలు చేశారు. స్వామియే శరణం అంటూ ఆలయ పరిసరా ప్రాంతాలు మారుమోగాయి. అనంతరం భిక్ష ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో గురుస్వాములు, అయ్యప్ప స్వాములు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న స్వామి.. సల్లంగా చూడయ్యా

» ఊట్‌పల్లిలో ఘనంగా మల్లన్న కల్యాణ మహోత్సవం



ఊట్‌పల్లిలో మహిళల బోనాలు తీసుకెళ్తున్న దృశ్యం

బోధన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మల్లన్న స్వామి అందరినీ చల్లంగ చూడయ్యా అంటూ ఊట్‌పల్లి గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు బోనాలతో మల్లన్న స్వామి ఆలయం వరకు ఆటపాటలతో తరలివెళ్లారు. బోధన్ మండలంలోని ఊట్‌పల్లి గ్రామంలో మల్లన్న స్వామి దేవాలయంలో ఆదివారం మల్లన్న స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతర నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య మల్లన్న స్వామి ఆలయంలో మల్లన్న కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచారం ప్రకారం మహిళలు బోనాలతో ఊరేగింపుగా మల్లన్న ఆలయానికి ఆటపాటలతో చేరుకున్నారు. స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, మహిళలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్సులో మహిళ ప్రసవం

ఎడపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండలంలోని ఏఆర్పీ గ్రామానికి చెందిన మీనకు ఆదివారం పురిటినొప్పులు రావడంతో కుటుంబీకులు అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఈ సమాచారంతో రెంజల్ మండలంలోని అంబులెన్స్ సిబ్బంది ఏఆర్పీ గ్రామం చేరుకొని పురిటి నొప్పులతో బాధపడుతున్న మీనను నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా, మార్గ మధ్యలో జానకంపేట వద్ద నొప్పులు అధికమయ్యాయి. దీంతో అక్కడే అంబులెన్స్ వాహనాన్ని నిలిపి వేశారు. అక్కడే వాహనంలోనే ప్రసవం చేయడంతో ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నారని, అదే అంబులెన్సులో జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు అంబులెన్స్ సిబ్బంది తెలిపారు. ప్రసవం చేయడంతో అంబులెన్సు సిబ్బంది సంజీవ్‌గౌడ్, నైముద్దీన్‌లకు మీన కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

నువ్వెక్కడ.. నేనెక్కడ






నందిపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నిర్వహణతో పల్లెల్లో సందడి వాతావరణం నెలకొంది. అన్నీ కలిసొస్తే ఒకే కుటుంబంలో నుంచి ఇద్దరుముగ్గురు బరిలో ఉంటున్నారు. అయితే నందిపేట మండలంలోని 8 గ్రామాల్లో భార్యాభర్తలు ఎన్నికల బరిలో నిలవడం విశేషంగా మారింది. మండలంలోని చింరాజ్‌పల్లి రాజేండ్ల లావణ్య సర్పంచ్ పదవికి, ఆమె భర్త మురళి వార్డుసభ్యుడిగా బరిలో ఉన్నారు. జోర్పూర్‌లో మచ్చర్ల లలిత సర్పంచ్‌కు, ఆమె భర్త 4వ వార్డులో పోటీలో ఉన్నారు. ఖుద్వాన్ పూర్‌లో మంగ్లారం శ్రీజ, రాపెల్లి మహిత, బొమ్మ పద్మలు సర్పంచ్‌గా పోటీలు ఉండగా వాళ్ల భర్తలు నవీన్, సతీష్, శ్రీనివాస్‌లు 4వ వార్డులో తలపడనున్నారు. రైతుపారంలో పసుపులేటి శివలీలా సర్పంచ్‌కు, ఆమె భర్త నాగేశ్వర్ రావు 5వ వార్డులో వార్డు సభ్యునిగా పోటీలో ఉన్నారు. మల్లారంలో సునీత సర్పంచ్‌కు, ఆమె భర్త శ్రీనివాస్ 6వ వార్డుకు, మల్లైకా తబుస్సుం సర్పంచ్, ఆమె భర్త మహిమూద్ 7వ వార్డులో పోటీలో ఉన్నారు.

దోమకొండ: మండలంలోని గొట్టిముక్కలలో 3వ వార్డులో ధర్పల్లి స్వప్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆమెభర్త వెంకటరెడ్డి 7వ వార్డులో పోటీలో ఉన్నారు.

పల్లెల్లో యువపోరు



డొంకేశ్వర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి దూరంగా ఉన్న గ్రామాలను బాగు చేసుకునేందుకు యువత ఆలోచించి ముందుకొస్తున్నారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో చాలామంది ముందుకొస్తున్నారు. డొంకేశ్వర్ మండలంలోని 13 గ్రామపంచాయతీలో 65 మంది పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ పదవులకు పోటీ చేసేందుకు బరిలో నిలిచారు. కాగా అందులో 25 ఏళ్లకు పైబడిన వారు 50 మంది ఉండటం విశేషం. ఎక్కువగా యువత మండలంలో ఆయా గ్రామాల్లో వార్డు, సర్పంచ్ స్థానాల్లో మొదటిసారి బరిలో నిలిచి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ప్రస్తుత రాజకీయం గ్రామాల్లో యువకుల చుట్టూ తిరుగుతుంది. గతంలో సర్పంచులుగా 40 నుంచి 50 ఏళ్ల వయస్సు వారు మాత్రమే పోటీల్లో ఎక్కువగా ఉండేవారు. కానీ ఈసారి సర్పంచ్ ఎన్నికల్లో డొంకేశ్వర్ మండలంలో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. దీనికి తోడు చదువుకున్న వారు నిరుద్యోగులు గ్రామ రాజకీయాల్లో పట్టు నిలుపుకునేందుకు సిద్ధం అవుతు న్నారు. 2019లో జరిగిన ఎన్నికల్లో 45 ఏళ్ల వయస్సు వారే ఎక్కువ శాతం మంది పోటీకి దిగి గెలిచారు.

గ్రామ సంగ్రామం

నాడు మామ.. నేడు కోడలు





కమ్మర్‌పల్లి, డిసెంబరు 7: (ఆంధ్రజ్యోతి) ఎన్నికల్లో గెలుపోటములు సహజం. అయితే ఎన్నో సమీకరణాలు అనుకూలిస్తే గానీ ఎన్నికల్లో గెలుపు రుచి దొరకదు. అయితే ఒకే కుటుంబంలో మామ గతంలో ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నికవగా, ఆయన కోడలు ప్రస్తుత ఎన్నికల్లో ఏకగ్రీవ సర్పంచ్‌గా ఎన్నికవడం విశేషం. బాల్కొండ నియోజకవర్గంలోని ఉమ్మడి మానాల గ్రామం నుంచి 1986లో మాలోత్ నరహరినాయక్ ఏకగ్రీవ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. కాగా ఆయన వేములవాడలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలి గ్రామాభివృద్ధి నేపథ్యంలో సర్పంచ్ ఎన్నికల్లో బరిలో దిగి గెలుపొందారు. కాగా ఆయన కోడలు మానాల రజిత ప్రస్తుత ఎన్నికల్లో ఉమ్మడి మానాల గ్రామం నుంచి వీడిపోయిన 14 తండాలు కలిపి ఏర్పడిన సర్పంచ్‌తాండ గ్రామ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా ఆమె బీఫార్మసీ చదువుకున్నారు.

అరచేతిలో ప్రచారం



- స్థానిక పోరులో గెలుపే లక్ష్యంగా స్మార్ట్‌వర్క్
- ఏఐ సాయంతో సోషల్ మీడియాలో ప్రచారం
- ఫ్లెక్సీ షాపులకు గిరాకీ ఫుల్



కామారెడ్డి రూరల్, డిసెంబరు 07 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలు అంటే .. బ్యానర్లు కట్టడం, కరపత్రాలు అందించడం లాంటి పనులతో ప్రచారం హోరెత్తేది. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం మూలంగా ప్రచార సరళి స్మార్ట్‌గా మారిపోయింది. ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) మూలంగా ఫోన్‌లోనే వీడియోలు, ఫ్లెక్సీ షాపులలో పోస్టర్ డిజైనింగ్ రూపొందించి సోషల్ మీడియా గ్రూపులను హోరెత్తిస్తున్నారు.

- పాపులర్ పాటలతో వాట్సప్ స్టేటస్‌లు

కామారెడ్డి జిల్లాలో సర్పంచ్ అభ్యర్థులు, వార్డు స్థానాల అభ్యర్థులు రాజకీయ నాయకులకు పాపులర్ పాటలతో ఏఐ సహాయంతో వీడియోలు రూపొందించి వాట్సాప్ స్టేటస్ రూపంలో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఒకప్పుడు ఇంటింటికి తిరిగి చేసిన ప్రచారం, ఇప్పుడు సోషల్ మీడియాలో, వాట్సాప్ స్టేటస్‌లో మారుమోగుతుంది. నూతనంగా అందుబాటులోకి వచ్చిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రచారం కార్యక్రమంలో అభ్యర్థులకు వరంగా మారింది. దీంతో ప్రచార ఖర్చు కూడా తగ్గనుంది. ఏఐ సహాయంతో ట్రెండింగ్‌లో ఉన్న సాంగ్స్‌తో తమ ఫొటోలు జోడించి ఎడిట్ చేయించి సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్‌లో మార్మోగిస్తున్నారు. కొంతమంది సోషల్ మీడియా ప్రచారం కోసం ప్రత్యేకంగా టీమ్‌ను నియమించుకొని వీడియోలు, పోస్టర్లను తయారు చేయించి ఓటర్లకు చేరేలా సోషల్ మీడియాలో గ్రూపులు క్రియేట్ చేసి ప్రచారం చేసుకుంటున్నారు.

దారి చూడు.. గుంత చూడు మామ..



- తల్వేద-నాళేశ్వర్ రోడ్డు దుస్థితి
- మూడేళ్లుగా ఇదే పరిస్థితి

అధిక వర్షాలకు కొట్టుకుపోయిన తారు రోడ్డు

నందిపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నందిపేట మండలం తల్వేద, నవీపేట మండలం నాళేశ్వర్ గ్రామాల మధ్య ఉన్న రహదారి గుంతలమయంగా మారి ప్రయాణానికి ప్రమాదకరంగా మారింది.ఈ రహదారిపై నిత్యం వేలాదివాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ఆర్మూర్ బెల్ట్ గ్రామాల ప్రజలు సైతం బాసర పుణ్యక్షేత్రానికి ఇదే దారిలో వెళ్తుంటారు.



తల్వేద గ్రామ శివారులో తారు రోడ్డుపై అడుగడుగున గుంతల దృశ్యం

అంతే కాకండా భైంసా, కుబీర్ మండలాలకే కాకుండా మహారాష్ట్రలోని పలు ప్రాంతాలకు ప్రయాణిస్తుంటారు. ఇంత రద్దీగా ఉండే ఈ రహదారి ఏటా కురుస్తున్న వర్షాల కారణంగా పాడవుతోంది. సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించకుండా అధికారులు తాత్కాలిక మరమ్మతులతో సరి పెట్టుకుంటున్నారు. కానీ ఈ సంవత్సరం సంబంధిత శాఖ అధికారులు ఆ తాత్కాలిక చర్యలు సైతం చేపట్టలేదు. దీంతో అడుగు తీసి అడుగేస్తే గుంతలే కనిపిస్తున్నాయి. ఈ రోడ్డుపై ప్రయాణం ప్రమాదకరమని తెలిసినా వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం చేస్తున్నారు. ప్రతి సోమవారం నందిపేట మండ ల కేంద్రంలో జరిగే వారాంతపు సంతకు నవీపేట మండలంలోని బినోల, నాళేశ్వర్, నందిగామ మీదుగా వందలాది వాహనాలు వస్తుపోతుం టాయి. కార్లు, స్టీరింగ్ ఆటోలు, బండిపై వస్తే మరునాడు గ్యారేజ్‌కే తీసుకెళ్లాల్సి వస్తోందని ప్ర యాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు ప్రయాణికులైతే విలువైన కార్లను ఇంటి దగ్గరే వదిలి ద్విచక్ర వాహనాలపై ప్రయాణం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.



తల్వేద- నాళేశ్వర్ రోడ్డుపై ఏర్పడ్డ పెద్ద గంత

నియోజక వర్గాల అడ్డంకే కారణమా?

నందిపేట మండలం తల్వేద గ్రామం ఆర్మూర్ నియోజకవర్గ పరిధిలోకి వస్తుంది. అలాగే నవీపేట మండలం నాళేశ్వర్ గ్రామం బోధన్ నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది. ఈ గ్రామాల మధ్య వంతెన ఉంటుంది. దానిపై బ్రిడ్జి సగం శివారు తల్వేదకు మరో సగం నాళేశ్వర్‌కు వస్తోంది. దీంతో అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టనట్లుగా వ్యవహ రిస్తున్నట్లు ఆ నియోజకవర్గాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వ సలహాదారు స్పందించాలి



తల్వేద- నాళేశ్వర్ రోడ్డు శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వ ముఖ్య సలహాదారులు సుదర్శన్ రెడ్డి స్పందించాలి. జిల్లాకు ఆయనే పెద్ద దిక్కు కనుక, సంబంధిత అధికారులతో సర్వే చేయించి, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలి. నిధులు మంజూరు చేయించాలి. నియోజక వర్గాలు వేరైనా జిల్లా ప్రజలను దృష్టిలో పెట్టుకోవాలి.

- సాయరెడ్డి మాజీ ఉప సర్పంచ్, తల్వేద

ఘనంగా సంత మల్లన్న జాతర



అంక్సాపూర్ నుంచి సంతమల్లన్న ఆలయం వరకు రథాన్ని తీసుకెళ్తున్న భక్తులు

వేల్పూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామ సంత మల్లన్న జాతర ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా సాయంత్రం గ్రామంలో ఉత్సవ విగ్రహమూర్తులను గోదావరి గంగజలాలతో అభిషేకం నిర్వహించి షిడి(రథం)కు మహిళలు నీటితో అభిషేకం చేశారు. అనంతరం రంగురంగు బంతిపూలతో అందంగా అలంకరించిన రథాన్ని గ్రామానికి చెందిన సంతమల్లన్న మాలధారణ స్వాములు, భక్తులు తాళ్ల సహాయంతో గ్రామం నుంచి గుట్ట సంతమల్లన్న ఆలయం వరకు తీసుకువచ్చారు. అనంతరం విగ్రహామూ ర్తులను డప్పు వాయిద్యాల మధ్య గుట్టపై ఉన్న ఆలయ గర్భగుడిలోకి తీసుకెళ్లారు. సోమవారం జరగనున్న జాతర రథోత్సవానికి గ్రామాభివృద్ధి కమిటి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

సర్పంచ్ మాదే.. వార్డు మాదే

- మాసానిపల్లిలో సర్పంచ్, వార్డుమెంబర్ల ఏకగ్రీవం..
- ఈ గ్రామ పంచాయతీ పాలకవర్గం అంతా మహిళలే



మాసానిపల్లి గ్రామంలో సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులుగా ఎన్నికైన మహిళలు

నాగిరెడ్డిపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డిపేట మండలంలోని మాసానిపల్లి గ్రామ పంచాయతీకి సర్పంచ్, ఉపసర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులంతా మహిళలే ఏకగ్రీవంగా ఎన్నికై అందరికీ ఆదర్శంగా నిలిచారు. మాసానిపల్లి గ్రామపంచాయతీకి రెండో విడత ఎన్నికలు జరగనుండగా, సర్పంచ్ స్థానాన్ని అన్ రిజర్వుడ్ మహిళకు రిజర్వ్ చేశారు. ఈ గ్రామ పంచాయతీలో ఎనిమిది వార్డు స్థానాలు ఉన్నాయి. ఈసారి గ్రామంలో గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని గ్రామస్థులంతా సమావేశమై ఎన్నికలను ఏకగ్రీవం చేయాలని తీర్మానించారు. సర్పంచ్ తో పాటు, పంచాయతీకి చెందిన 8 వార్డు స్థానాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ సర్పంచ్‌గా మహిళా ఉండనున్నందున, సర్పంచ్‌తో పాటు 8 వార్డు స్థానాల్లో మహిళలే ఉండాలన్న లక్ష్యంతో మహిళా వార్డు సభ్యులను ఎంపిక చేసి వారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సర్పంచ్‌గా పెద్దపట్లోల్ల సునంద ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే 1వ వార్డుకు బొల్లారం లక్ష్మి, 2వ వార్డుకు నాగులూరి అంజవ్వ, 3వ వార్డుకు లోక సింగవ్వ 4వ వార్డుకు గంగరబోయిన దుర్గవ్వ, 5వ వార్డుకు గంగరబోయిన సంగవ్వ, 6వ వార్డుకు సామల సుగుణవ, 7వ వార్డుకు చిన్న పట్లోల్ల సుమలత, 8వ వార్డుకు నాసిరి సంతోషలు వార్డు సభ్యురాలుగా ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. ఆదివారం గ్రామపంచాయతీలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ఉపసర్పంచ్ ఎన్నికలు నిర్వహించగా, గ్రామపంచాయతీ నూతన పాలకవర్గం మొత్తం కలిసి 4వ వార్డు సభ్యురాలిగా ఎన్నికైన గంగార బోయిన దుర్గవ్వను ఉప సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు ఎంపిక పత్రాలు అందజేశారు. గ్రామపంచాయతీ పాలకవర్గం మొత్తం మహిళలతో ఏర్పాటైనందున, మహిళా ప్రతినిధుల ఆధ్వర్యంలో గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని గ్రామస్థులు ఆశిస్తున్నారు



మాక్లూర్‌లో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దు

మాక్లూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో ఎవరు శాంతి భద్రతలకు విఘాతం కల్పించవద్దని స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని నిజామాబాద్ ఏసీపీ రాజ వెంకట్ రెడ్డి అన్నారు. మాక్లూర్ పోలీసుస్టేషన్ పరిధిలోని సమస్యాత్మక గ్రామాలైన కల్లెడ, మాక్లూర్ గ్రామాలలో ఆదివారం నిజామాబాద్ నార్త్ బోధన్ సర్కిల్ పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. డబ్బు మద్యానికి ఓటును అమ్ముకోకూడదని కోరారు. ఈ కార్యక్రమంలో నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, మాక్లూర్, నవీపేట్, ఐదవ టౌన్ ఎస్సైలు రాజశేఖర్, తిరుపతి, గంగాధర్, మెగులయ్యలతో పాటు 50 మంది సిబ్బంది, క్యూఆర్‌డీ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక



బీజేపీలో చేరిన నాయకులతో మండల ఇన్‌చార్జి శ్రీధర్ రెడ్డి

భిక్కనూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లుపల్లి గ్రామానికి చెందిన 30 మంది యువకులు సర్పంచ్ అభ్యర్థి మాలేస్వామి ఆధ్వర్యంలో ఆదివారం బీజేపీలో చేరారు. వీరికి మండల ఇన్‌చార్జి శ్రీధర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కామారెడ్డి నియోజకవర్గంలో అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు రమేష్, కామారెడ్డి పట్టణాధ్యక్షుడు శ్రీకాంత్, లక్ష్మీపతి, గ్రామ అధ్యక్షుడు వెంకటరెడ్డి, బూత్ అధ్యక్షుడు సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికార కాంగ్రెస్‌లో వర్గపోరు

బీర్కూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో బీర్కూర్‌లోని గ్రామాలలో ఎన్నికల వేడి రాజుకుంది. బీర్కూర్ మండలంలో అధికార కాంగ్రెస్ 2 వర్గాలుగా చీలిపోయింది. పలు గ్రామాల్లో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి వర్గం నుంచి, మాజీ ఎమ్మెల్యే రవీందర్ రెడ్డి వర్గం నుంచి వేర్వేరుగా సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో మండలంలో నువ్వా నేనా అన్న తీరుగా పరిస్థితి తయారైంది. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే రవీందర్ రెడ్డి ఇద్దరూ అధికార కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నారు. అయితే ఇద్దరి మధ్య కొంత రాజకీయ విభేదాలు ఉన్న విషయం అందరికీ తెలిసిందే. కాంగ్రెస్‌లో నాయకులు, కార్యకర్తలు 2 వర్గాలుగా చీలిపోయారు. దీంతో అధికార పార్టీలోనే ఎన్నికల పోరు తీవ్రతరమైంది.

13 సర్పంచ్ స్థానాలకు 94 నామినేషన్లు

బీర్కూర్ మండలంలో 13 గ్రామ పంచాయతీలు ఉండగా, ఆ గ్రామాల్లో 114 వార్డులు ఉన్నాయి. అయితే 13 సర్పంచ్ స్థానాలకు గాను 94 నామినేషన్లు దాఖలు కాగా 114 వార్డులకు 294 నామినేషన్లు దాఖలయ్యాయి.

ఆందోళనలో అభ్యర్థులు

వర్గపోరుతో అభ్యర్థుల్లో ఆందోళన

బీర్కూర్ మండలంలో 13 గ్రామ పంచాయతీలకు ఈనెల 17న సర్పంచ్ ఎన్నికలు జరగను న్నాయి. అయితే కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నుంచే కాకుండా స్వతంత్ర అభ్యర్థులు కూడా నామినేషన్లు దాఖలు చేసి, ఎన్నికల బరిలో నిలిచారు. ఒక్కో పార్టీ తరఫున ఒక్కో అభ్యర్థిని బరిలో నిలిపారు. అధికార కాంగ్రెస్ పార్టీలో తాజా, మాజీ ఎమ్మెల్యేల అనుచరుల మధ్య వర్గ పోరు నెలకోవడం కారణంగా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నుండి రెండు వర్గాల తరఫున వేర్వేరుగా సర్పంచ్, వార్డు మెంబర్లను బరిలో నిలిపారు. దీంతో అధికార పార్టీ అభ్యర్థుల్లో ఆందోళన మొదలైంది. కాంగ్రెస్ పార్టీకి ఉన్న ఓటు బ్యాంకు రెండు వర్గాలకు చీలి ఇత ర పార్టీల అభ్యర్థులకు ఎక్కడ ప్రయోజనం చేకూరుస్తోందో అనే బెంగ అభ్యర్థుల్లో అధిక మయ్యింది. కాంగ్రెస్‌లో వర్గపోరు కాంగ్రెస్ పార్టీకి నష్టం చేకూర్చేలా ఉందని పలువురు నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నష్టాన్ని పూడ్చడానికి కొందరు నాయకులు రెండు వర్గాల మధ్య సయోధ్య కుదిర్చి పార్టీ తరఫున ఒకరినే బరిలో నిలిపేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు తెలుస్తుంది. ఈ నెల 9న నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ఉన్న నేపథ్యంలో ఎంతమంది నామినేషన్లను ఉపసంహరించుకుంటారో, ఎంత మంది బరిలో నిలుస్తారు అనే విషయం తేలనుంది. బీర్కూర్ మండలంలో బీర్కూర్, బరంగ్‌ఎడ్గి, భైరాపూర్, కిస్టాపూర్, అన్నారం, చించోల్లి, దామరంచ, వీరాపూర్, సాంబాపూర్, మల్లాపూర్ గ్రామాలలో కాంగ్రెస్ తరఫున 2 వర్గాల నుండి నామినేషన్లు దాఖలు అయ్యాయి. ఈ వర్గపోరు వ్యవహారం ఎక్కడికి దారితీస్తుందో వేచి చూడాల్సిందే మరి.

సంత్ సేనా మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ

నిజామాబాద్ కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నాయిబ్రాహ్మణ కులదైవమైన సంత్ సేనా మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజను నుడా చైర్మన్ కేశవేణు నిర్వహించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్ హనుమాన్ జంక్షన్ వద్ద నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాయిబ్రాహ్మణుల కులదైవమైన సంత్ సేనా మహరాజ్ విగ్రహం ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. తెలంగాణలో ఎక్కడాలేని విధంగా విగ్రహాన్ని మొట్టమొదటిసారిగా ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘ జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ ఆంజనేయులు, రాష్ట్ర నాయిబ్రాహ్మణ అధ్యక్షుడు నర్సింలు, గాజుల్‌పేట్ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు గోపాల్, సురేందర్, నిజామాబాద్ నాయిబ్రాహ్మణ దుకాణాదారుల సంఘం అధ్యక్షుడు గంగాధర్, నాయిబ్రాహ్మణ జిల్లా అధ్యక్షుడు మోహన్, ఉపాధ్యక్షులు హన్మాండ్లు, శివానందం, రామకృష్ణ, జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న నుడా చైర్మన్ కేశవేణు

వైభవంగా అయ్యప్ప మహాపడిపూజ



పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి, భక్తులు

ధర్పల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం సామూహిక మహాపడిపూజ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని అయ్యప్ప సన్నిధానంలో జరిగిన ఈ మహాపడిపూజ కార్యక్రమానికి ధర్పల్లి, ఇందల్వాయి, డిచ్‌పల్లి, సిరికొండ, నిజామాబాద్ మండలాలకు చెందిన అయ్యప్ప భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఉదయం నుంచి అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహాపడి పూజ కార్యక్రమానికి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ధర్పల్లి అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఏకమయ్యారు.. ఏకగ్రీవం చేశారు

- నాగిరెడ్డిపేటలో ఆరు సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం
- ఐదు గ్రామాల్లో సర్పంచ్ స్థానం సహా పాలకవర్గమంతా ఏకగ్రీవం



అక్కంపల్లి గ్రామంలో ఎన్నిక పత్రాలు అందుకున్న పాలకవర్గ సభ్యులు

నాగిరెడ్డిపేట, డిసెంబరు 7 (ఆంధ్ర జ్యోతి): నాగిరెడ్డిపేట మండలంలో రెండో విడత జరగనున్న గ్రామపంచాయతీల ఎన్నికలకు గాను మండలంలో 6 సర్పంచ్ స్థానాల్లో సర్పంచ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అందులో ఐదు గ్రామపంచాయతీల్లో సర్పంచ్ స్థానాలతో పాటు మొత్తం వార్డు సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామపంచాయతీల్లో ఆదివారం ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ఆయా గ్రామ పంచాయతీలకు సంబంధించి ఉపసర్పంచ్‌ల ఎన్నికలు నిర్వహించారు. ఈ 5 గ్రామపంచాయతీల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్, పాలకవర్గం సభ్యులు కలిసి ఉపసర్పంచ్‌లను సైతం ఏకగ్రీవంగానే ఎన్నుకున్నారు. దీంతో ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులందరికీ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ఎన్నిక పత్రాలను అందజేసినట్టు స్థానిక ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ తెలిపారు. మండలంలోని మాసాని పల్లి గ్రామపంచాయతీకి ఏకగ్రీవ సర్పంచ్‌గా పెద్దపట్లోల్ల సునంద ఎన్నిక కాగా, ఉప సర్పంచ్‌గా గంగరబోయిన దుర్గవ్వ ఎన్నికైనట్టు పల్లె బోగడ తండా గ్రామ పంచాయతీకి సర్పంచ్‌గా ధనావత్ పార్వతి ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, ఉప సర్పంచ్‌గా ధనావత్ వనిత, అక్కంపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ గా గుండారం వెంకా గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, ఉప సర్పంచ్ గా కొత్తపేట శ్రీనివాస్, వెంకంపల్లి గ్రామపంచాయతీకి సర్పంచ్‌గా చిలుకూరి జ్యోతి, ఉప సర్పంచ్‌గా ఆకిడి హన్మంత్ రెడ్డి, అచ్చయపల్లి గ్రామపంచాయతీకి సర్పంచ్ గా బెస్త సాయిలు, ఉపసర్పంచ్ గా కట్ట శ్రీనివాస్ ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. ఎన్నికైన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులందరికీ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ఎన్నిక పత్రాలను అందజేశామన్నారు. అలాగే నాగిరెడ్డిపేట గ్రామపంచాయతీ సర్పంచ్‌గా మన్నే వెంకట్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ గ్రామపంచాయతీలో 10 వార్డు సభ్యులకు గాను 5 వార్డు సభ్యులు ఏకగ్రీవమైనట్టు, మరో 5 వార్డుల స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయన్నారు. మండలంలో 27 గ్రామాలకు 6 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం కాగా 21 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. 21 సర్పంచ్ స్థానాలకు 70 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. 232 వార్డు స్థానాల్లో 103 ఏకగ్రీవం కాగా 129 వార్డు స్థానాల్లో ఎన్నికలు జరుగను న్నాయని, వీటిలో 282 మంది అభ్యర్థులు పోటీచేస్తున్నారన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

భిక్కనూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని బస్వాపూర్‌కు చెందిన పలువురు ఇతర ఇతర పార్టీల నుంచి ఆదివారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరికి ఆయన పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ చేపడుతున్న అభివృద్ధి పథకాలకు ఆకర్శితులై బస్వాపూర్‌కు చెందిన చాలామంది కాంగ్రెస్‌లో చేరుతున్నారని అన్నారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు సిద్ధరాములు, సర్పంచ్ అభ్యర్థి తుడుం స్వామి పాల్గొన్నారు.

సరుకుల పంపిణీ



సరుకులను అందజేస్తున్న దృశ్యం

రామారెడ్డి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఒగ్గు వెంకట స్వామి కుటుంబానికి, బైండ్ల భూమయ్య కుటుంబానికి ఆదివారం నాయకులు 50కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు, డబ్బులను ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో బైండ్ల బైరయ్య, నారాయణ, భూలక్ష్మి, మమత పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ జిల్లా వైస్ గవర్నర్‌గా నాగేశ్వర్

దోమకొండ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): వాసవీక్లబ్ జిల్లా వైస్ గవర్నర్‌గా బాశెట్టి నాగేశ్వర్, ప్రాంతీయ కార్యదర్శి మోటూరి శ్రీకాంత్, జోన్‌చైర్మన్‌గా నాగభూషణం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో జాతీయ వాసవీ క్లబ్ కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా గవర్నర్ నరాలశ్రీనివాస్, బీబీపేట ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు యాదగిరి, వాసవీ మాజీ డిప్యూటీ గవర్నర్ విశ్వప్రసాద్, రమేష్, కోశాధికారి నాగభూషణం, సభ్యులు చంద్రశేఖర్, వెంకటేశం, నీలబైరయ్య పాల్గొన్నారు.

రేపు ఆటో బతుకుల రాష్ట్ర సభ



ఆటో బతుకుల రాష్ట్ర సభ వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న ఆటోడ్రైవర్లు

లింగంపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని వర్నిలో మంగళవారం గ్రామీణ ప్రాంతాల ఆటోబతుకుల రాష్ట్ర సభను ఏర్పాటు చేసినట్లు ఆటోయూనియన్ జాక్ రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఉమర్‌ఖాన్‌లు అన్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈసందర్బంగా వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 2023లో ఆటోడ్రైవర్లకు సంవత్సరానికి రూ.12వేలు అందజేస్తామని చెప్పి ఇప్పటి వరకు అందజేయలేదని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చితికిపోయిన ఆటో డ్రైవర్ల బతుకులను ఆదుకోవాలని వారు కోరారు. ఆటో సంక్షేమబోర్డు ఏర్పాటు చేసి రూ.వేయి కోట్లు నిధులు కేటాయించాలని వారు కోరారు. ప్రభుత్వం ఆటోడ్రైవర్లను ఆదుకోకపోతే స్థానిక ఎన్నికల్లో ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని వారన్నారు. కార్యక్రమంలో లక్ష్మగౌండ, గంగారాం, ఆసీఫ్, మధు, సుభాష్, సురేష్, గణేష్, అశోక్, సాయిబాబ, సధుల్, శ్రీకాంత్‌లతో పాటు ఆటో డ్రైవర్లున్నారు.



జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడిని కలిసిన కార్యవర్గ సభ్యులు

జీపీవోల నూతన కార్యవర్గం ఎన్నిక

» జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా సాయినాథ్, సంతోష్

సుభాష్‌నగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అసోసియేషన్ అనుబంధంగా ఉన్న జీ పీవోల జిల్లా నూతన అధ్యక్ష కార్యదర్శులుగా బి య్యా సాయినాథ్, గున్నం సంతోష్‌ను ఏకగ్రీవం గా ఎన్నుకున్నారు. జిల్లాకేంద్రంలోని రెవెన్యూ అసోసియేషన్ భవన్‌లో ఆదివారం కార్యవర్గ స మావేశం నిర్వహించారు. మహిళ అధ్యక్షురాలి గా గంగాభవానీని ఎన్నుకున్నారు. కోశాధికారిగా నల్ల ప్రశాంత్, ఉపాధ్యక్షులుగా పబ్బ సుధాకర్, నీరడి రమేష్, గంగాధర్, సహాయ కార్యదర్శులుగా భూపాల్, మోహన్, ముఖ్య సలహాదారులుగా సాంబారు లింబగిరి, బేగరి నరేష్, గంగాధర్, క్రీడాకార్యదర్శిగా సందీప్, కార్యవర్గ సభ్యులుగా అసదుద్దీన్, అరుణ, నిఖిల్, రాజన్న, అమృ త్‌రావు, బేగరి వినోద్, శివకుమార్ ఎన్నికయ్యా రు. జీపీవోల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పాటుపడతామని నూతనంగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులు తెలిపారు. రెవెన్యూ అసోసియేషన్‌కు అనుబంధంగా ఉంటూ వారి సూచనలు, సలహాలు పాటిస్తామని తెలిపారు. అనంతరం జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడిని కలిసి సన్మానించారు.

ఉత్సాహంగా ఆనంద్ పరివార్ మేళా

నిజామాబాద్ కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఒకరినొకరు ఆత్మీయ పలుకరింపులతో ఆనంద్ పరివార్ మేళా ఉత్సాహంగా సాగింది. ఆదివారం జిల్లా కేంద్రంలోని కోటగల్లీ సాహితీ కళావేదికపై సంస్కార భారతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆనంద్ పరివార్ మేళా ఆద్యంతం ఆత్మీయ పలకరింపులతో కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంస్కార భారతి తెలంగాణ ప్రాంత సంఘటన మంత్రి జేపీ నిరంజన్ హాజరై మాట్లాడారు. దేశంలో జరుగుతున్న మార్పులు రాబోయే కాలంలో విద్యావిధానంలో వచ్చే నూతన మార్పులో పంచపరివర్తన్ కళామాధ్యమం ద్వారం దేశసంస్కృతిని ప్రపంచానికి చాటి చెప్పాలని పేర్కొన్నారు. హిందూ సంప్రదాయంలో కుటుంబ వ్యవస్థ, ప్రేమ, సేవా వంటి అంశాలు ముడిపడి ఉంటాయన్నారు. ప్రపంచ నాగరికతకు భారతదేశ సంస్కృతి సంప్రదాయమే స్ఫూర్తి అని జేపీ నిరంజన్ కొనియాడారు. కుటుంబాలు ఎంత నిలకడగా ఉంటే సమాజం అంత బలంగా, ఏకమై ఉంటుందని సంస్కార భారతి తెలంగాణ ప్రాంత సంఘటన మంత్రి జేపీ నిరంజన్ పేర్కొన్నారు. సభ్యులు ఆటపాటలతో సందడి చేశారు.

అయ్యప్ప ఆలయానికి విరాళం



దాతను సన్మానిస్తున్న సభ్యులు

దోమకొండ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): దోమకొండ అయ్యప్ప అన్నప్రసాద సేవా సమితికి రూ.10116ను మెదక్ జిల్లా ముంబోజీపల్లికి బూర్ల ప్రవీణ్‌జ్యోతి అందించారు. ఈ సందర్భంగా దాత ప్రవీణ్‌ను సమితి చైర్మన్ సుదర్శన్‌గౌడ్, సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు నర్సారెడ్డి, స్వాములు నరేందర్, అబ్బయ్యలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య తీరేనా?

(5వ పేజీ తరువాయి)

జిల్లాలు, మండలాల నుంచి వస్తున్న ప్రయాణికులతో రోడ్లన్ని నిత్యం కిక్కిరిసిపోతున్నాయి. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. ముందే ఇరుకుగా ఉన్న రోడ్లు ఆపై ఆక్రమణాలతో మరింత ఇరుకుగా మారుతున్నాయి. మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా రోడ్లు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.స్టేషన్‌రోడ్డు,సిరిసిల్లరోడ్డు, నిజాంసాగర్ రోడ్డు, సుభాష్‌రోడ్డు,తిలక్‌రోడ్డు,జేపీయన్‌రోడ్డు, కొత్తబస్టాండ్ నుంచి హౌజింగ్‌బోర్డు కాలనీ వరకు నిత్యం రద్దిమయంగా మారుతుంది.అయితే ఇటీవల అధికారులు చేపడుతున్న పలు సంస్కరణలతో మున్ముందు ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిపోయే అవకాశాలు కల్పిస్తున్నాయని వాహనదారులు పేర్కొంటున్నారు.ప్రభుత్వ ఆసుపత్రి నుంచి సుభాష్‌రోడ్డు, తిలక్‌రోడ్డులలో ప్రతి ఆదివారం కొనసాగే కూరగాయాల మార్కెట్‌తో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోనేవారు. దీంతో మున్సిపల్ అధికారులు ఇటీవల స్వాధీనం చేసుకున్న సర్వేనంబర్ 6లోకి రోడ్లపై విక్రయాలు జరిపే వారిని తరలించేందుకు చర్యలు చేపట్టారు. ఆ ప్రాంతంలో ఆక్రమణలను తొలగించిన గుడిసెలలో నివాసం ఉన్న వారికి ఖాళీ చేసి వెళ్లెందుకు సమయం ఇచ్చారు. శనివారం వారిని సైతం ఖాళీచేయించి స్థలాల్లో వ్యర్థాలను తొలగించేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. అప్పటివరకు ఈ ఆదివారం కూరగాయాల మార్కెట్‌ను ప్రతి గురువారం దుర్గమ్మగుడి ప్రాంతంలో కొనసాగే వీక్లిమార్కెట్‌లో నిర్వహింపచేశారు. ఈ మార్కెట్‌ను వాహనదారులకు ఇబ్బందులు కల్గకుండా వీక్లిమార్కెట్‌లోకి తరలించడంతో ఆ ప్రాంతం గుండా ట్రాఫిక్ ఇబ్బందులు మెరుగయ్యాయి. స్టేషన్‌రోడ్డులోని రైల్వేగోడకు ఆనుకొని ఉన్న మడిగెలను తొలగించేందుకు అధికారులు ఇప్పటికే నోటీసులు జారీచేశారు. అయితే వ్యాపారులు తమ జీవనాధారం దెబ్బతింటుందని ఆందోళన చెందడంతో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి శనివారం రైల్వేస్టేషన్ మరమ్మత్తుల పనులు పరిశీలనకు వచ్చిన సమయంలో వ్యాపారులు ఆందోళన చెందవద్దని పొట్టిశ్రీరాములు వద్ద ఉన్న స్థలం గంజ్ పాఠశాల ముందు స్థలంలో నిర్మించే మున్సిపల్ వాణిజ్యసముదాయాలలో మొదటి అవకాశం కల్పిస్తామని సూచించారు.



రోడ్లపై అమ్మకాలు జరిపే వ్యాపారులను వీక్లీ మార్కెట్‌కు తరలించడంతో ట్రాఫిక్ లేని దృశ్యం

పార్కింగ్ స్థలాలు లేక ఇక్కట్లు....

మున్సిపల్ పరిధిలో ట్రాఫిక్ సమస్య ప్రధానంశంగా మారింది. దాదాపు మున్సిపల్ పరిధిలో 3లక్షలకు పైగా వాహనాలు ఉన్నాయి.వీటితో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు ఉంటున్నాయి. ఇందులో కార్లు, ద్విచక్రవాహనాలు, ఆటోలు, ఇతర భారీ వాహనాలున్నాయి. అయితే ఎక్కువ సంఖ్యలో ఉన్నవి ద్విచక్రవాహనాలే. కానీ అందుకు అనుగుణంగా పార్కింగ్ స్థలాలు, అవసరమైన జంక్షన్లు లేకపోవడం వల్ల ట్రాఫిక్ నియంత్రణ అసాధ్యంగా మారింది. ప్రస్తుతం వాహనాలను నిలిపేందుకు ఏ ఒక్క చోట పార్కింగ్ స్థలాలు లేవు. వ్యాపార సముదాయాలు ఉన్న ప్రదేశాలైన కొత్తబస్టాండ్, నిజాంసాగర్ చౌరస్తా, ఇందిరా చౌక్, జేపీఎన్ రోడ్డు, స్టేషన్‌రోడ్డు, డెయిలీ మార్కెట్‌లలో వాహనాలను నిలిపేందుకు ప్రత్యేకంగా పార్కింగ్ సౌకర్యాలు లేవు. ఈ ప్రాంతాలలో గతంలో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులు నిర్ణయించినప్పటికి సంబంధిత శాఖల మధ్య సమన్వయలోపంతో ఇప్పటికి అది అమలుకు నోచుకోవడం లేదు. కనీసం ఈ ప్రాంతాలలో వ్యాపార సముదాయాల వారుసైతం పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసుకోలేక పోవడంతో వాహనదారులు తమ వాహనాలను ఎక్కడపార్కింగ్ చేసుకోవాలో తెలియక రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీనికి తోడు చిరువ్యాపారులు రోడ్లపైనే వ్యాపారం చేయడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రం అవుతుంది. ఏది ఏమైన ఇటివల మున్సిపల్ అధికారులు చేపడుతున్న పలు మార్పులతో ట్రాఫిక్ సమస్య తీరుతుందా...లేదంటే కొందరు తమ స్వార్థం కోసం చేసే ఒత్తిళ్లకు తలొగ్గి మధ్యలోనే వదిలేస్తారా వేచిచూడాలి.

ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలి

● ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డిటౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని సుభాష్‌రోడ్డు, తిలక్‌రోడ్డు, జేపీయన్ రోడ్డు ప్రాంతాలను ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఆదివారం తెల్లవారుజామున మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. రోడ్లపై కూరగాయాల అమ్మకాలు జరిపే వ్యాపారులతో మాట్లాడి ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించేందుకు సహకరించాలని కోరారు. ఈ సందర్బంగా అధికారులతో మాట్లాడుతూ రోడ్లపై కూరగాయలు అమ్మకుండా చూడడంతో పాటు ప్రతి ఒక్కరినీ వీక్లీమార్కెట్ ప్రాంతంలో కూరగాయలు అమ్మకాలు జరిపేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. దీంతో ప్రతి ఆదివారం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి సుభాష్‌రోడ్డు, తిలక్‌రోడ్డులలో జరిగే కూరగాయల మార్కెట్ వీక్లీమార్కెట్ ప్రాంతంలో సాగింది. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి, టీపీవో గిరిధర్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ పర్వేజ్, వార్డు అధికారులు, జవాన్‌లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే

ప్రజాపాలనకు రెండేళ్లు

(5వ పేజీ తరువాయి)

అందజేసింది. తర్వాత సబ్సిడీ రావడం లేదు.

గృహజ్యోతి కింద 1.56 లక్షల విద్యుత్ కనెక్షన్‌లకు జీరో బిల్లు

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకంలోని గృహజ్యోతి కార్యక్రమం కింద 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్‌ను అమలు చేస్తోంది. జిల్లాలో గృహజ్యోతి కింద ఇప్పటి వరకు 1,56,670 గృహ విద్యుత్ కనెక్షన్‌లకు జీరో బిల్లులను విద్యుత్‌శాఖ జారీ చేసింది. ఈ పథకం కింద రాయితీ నిధులను ప్రభుత్వం అందజేసింది. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద 5 లక్షల వరకు ఉన్న వైద్యఖర్చుల పరిమితిని 10 లక్షల వరకు ప్రభుత్వం పెంచిన విషయం తెలిసిందే. ఆరోగ్యశ్రీ పరిధిలో 163 వ్యాధుల చికిత్సలను చేర్చి మొత్తం 1,672 వ్యాధులకు చికిత్సలను అందిస్తోంది.

సన్న ధాన్యానికి బోనస్

ఎన్నికల సమయంలో రేవంత్ సర్కార్ ఇచ్చిన హామీ మేరకు పండించిన వరి పంటకు బోనస్ అమలు చేస్తోంది. ప్రధానంగా ఈ రెండేళ్ల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతకు అండగా నిలుస్తూ వచ్చింది. రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వమే కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోలు చేస్తోంది. ఇలా గత వానా కాలం సీజన్‌లో 64,098 మంది రైతుల నుంచి 4.04 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల ఖాతాలో రూ.804 కోట్లు జమ చేశారు. ఈ వానాకాలం సీజన్‌లో 69,636 మంది రైతుల నుంచి 3.98 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.780 కోట్లు రైతుల ఖాతాలో జమ చేశారు. అయితే గత వానాకాలం సీజన్‌లో రైతులు పండించిన సన్న ధాన్యానికి ప్రభుత్వం చెల్లించింది. తర్వాత యాసంగిలో ప్రభుత్వం బోనస్ నిధులు జమ చేయలేదు. ఈ వానా కాలం సీజన్‌లో 41,871 మంది రైతుల నుంచి రూ.413 కోట్ల విలువ చేసే 1.59 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇందులో ఇప్పటి వరకు 1.42 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యానికి గాను రూ.71.27 కోట్లు, 24,059 మంది రైతుల ఖాతాలో బోనస్ నిధులను జమ చేసింది. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు గత ఏడాది కిందట జిల్లాలో నాలుగు విడతల్లో రైతులకు రుణమాఫీ చేసింది.

కోవర్టుల కలవరం

(5వ పేజీ తరువాయి)

మారింది. సంగోజీపేట్, హన్మాజీపేట్, బుడ్మి, కొత్తబాద్, తాడ్కోల్, దేశాయిపేట్, మొదలగు గ్రామాల్లో సోషల్ మీడియా ప్రచారం రాత్రికి రాత్రే హాట్‌టాపిక్‌గా మారుతుండగా కోనాపూర్, కొల్లూరులో కుల ఆధారిత గ్రూపుల అండదండలు సర్పంచ్ అభ్యర్థులకు కొత్త లెక్కలు తెస్తున్నాయి. దేశాయిపేట్, బుడ్మి గ్రామాల్లో పార్టీ వర్గాల ప్రత్యక్ష జోక్యం స్పష్టంగా కనిపిస్తోంది. మండలంలోని ఒక గ్రామంలో ఓ వ్యక్తి సర్పంచ్‌గా పోటీ చేస్తున్న వ్యక్తికి కుల సంఘం మద్దతు లేకపోవడంతో జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో స్థానిక ఎన్నికల అధికారులు గ్రామంలో విచారణ చేపట్టి ఎన్నికల్లో పోటీ చేసే హక్కు ప్రతీ ఒక్కరికి ఉంటుందని భయభ్రాంతులకు గురిచేసే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలోని ఓ గ్రామంలో 40 ఏళ్లుగా ఏకగ్రీవం అవుతున్న గ్రామసర్పంచ్ పదవికి ఈ సారి ఇద్దరు నామినేషన్ వేయగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన అభ్యర్థికి సంబంధించిన నామినేషన్ పత్రాలు సరిగ్గా లేకపోవడం, అభ్యర్థిని బలపర్చిన వ్యక్తి మద్దతు ఉప సంహరించుకోవడంతో అభ్యర్థి యొక్క నామినేషన్ తిరస్కరించినట్లు పోటీదారు అధికార పార్టీ పంచన చేరినట్లు తెలిసింది.

ఎవరిని నమ్మలేని పరిస్థితిలో అభ్యర్థులు

సర్పంచ్ పోటీలో దిగిన అభ్యర్థులు మనతో పాటు తిరిగేవాళ్లే మన వెనుకాల కుట్రలు చేస్తున్నారు అంటు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎవరు నమ్మకస్తులు, ఎవరు మోసగాళ్లు, ఎవరిని నమ్మలేని పరిస్థితిలో అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు.

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తున్నా స్పందించని అభ్యర్థులు

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ విందులు, వాహనాల సంచారం, రహస్య ఒప్పందాలు కొనసాగుతున్నా ఎన్నికల అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఎన్నికల అధికారులు ప్రజాస్వామ్య బద్ధంగా గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలి

సుభాష్‌నగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బీసీ ఉద్యోగులకు పదోన్నతులలో రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ బీసీ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్ డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని బీసీ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ విద్యార్థులకు విద్యా, ఉద్యోగ రంగాల్లో 42శాతం రిజర్వేషన్ కల్పించి, బీసీ యువతను ఉన్నత స్థానాల్లో నిలబెట్టాలన్నారు. అగ్రవర్ణాలకు కల్పించిన 10శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ వెంటనే రద్దు చేసి ఆ కోటాను బీసీలకు వర్తింప చేయాలన్నారు. జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు లేకపోవడంతో విద్యా ఉద్యోగ రంగాల్లో అన్యాయం జరుగుతుందన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం 42శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీ ఉద్యోగులకు పెండింగ్ బిల్స్ ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని నెలకు 700ల కోట్లు కేటాయించామని ప్రభుత్వం ప్రకటించిందని వాస్తవంగా డబ్బులు ఎవరికి అందుతున్నాయనేది అర్థం కావడం లేదన్నారు. ఉద్యోగులకు బెనిఫిట్స్ రాక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. వెంటనే రిటైర్డ్ ఉద్యోగులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర బీసీ జేఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ దేశబోయిన రమ, రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంఘం వైస్ ప్రెసిడెంట్ జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ మద్దతుదారులను ఓడించాలి

(5వ పేజీ తరువాయి)

ఆయన మాట్లాడుతూ సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతు దారులకు ఓటుతో సురుకు పెట్టాలి అని ఆయన కోరారు.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేళ్లయిందని ఎన్నికల ముందు గ్యారెంటీ కార్డులు పంచి బాండ్ పేపర్ రాసిచ్చారు కాని ఇప్పటికీ ఒక్క హామీ కూడా అమలు చేయలేదని అన్నారు. ఇంటింటికి మంచినీళ్లు అందించింది కేసీఆర్, పది వేల రైతుబంధు ఇచ్చింది కేసీఆర్ అని ఆయన తెలిపారు.కేసీఆర్ కిట్టు పెట్టి 13వేల రూపాయలు కాన్పుకి ఇచ్చింది కేసీఆర్ అని ఆయన గుర్తు చేశారు.రేవంత్ రెడ్డి 2వేల పెన్షన్ను 4వేలు ఇస్తానన్నాడు. ఏమైంది కేసీఆర్ ఇచ్చిన 2వేలు తప్ప ఒక్క రూపాయి అయినా ఎక్కువ వచ్చిందా అని ప్రశ్నించారు.బతుకమ్మకు రెండు చీరలు ఇస్తానన్న రేవంత్ రెడ్డి బతుకమ్మకు చీరలకు ఎగ్గొట్టిండు. ఓటు కోసం ఒక చీర పంపిండు అది కూడా కొందరికి,పోరగాండ్ల స్కూలు యూనిఫామ్ లాగా ఉంది రేవంత్ రెడ్డి పంపిన చీర అని ఎద్దెవా చేశారు.కల్యాణ లక్ష్మి లేదు. తులం బంగారం అంతకంటే లేదు. అరచేతిలో వైకుంఠం చూపించి ఆగమాగం చేసిండని విమర్శించారు. ఆడోళ్ళకి ఫ్రీ బస్సు మొగోళ్ళకి డబుల్ టికెట్ అమలు చేస్తున్నాడని ఇది మోసం కాకపోతే ఏమిటని ప్రశ్నించారు.కాంగ్రెస్ పాలనలో కనీసం ఊర్లలో ట్రాక్టర్లలో డీజిల్ కి డబ్బులు లేవు. వీధిదీపాలకు బల్బులు లేవు కేసీఆర్ ఉన్నప్పుడే మంచిగా ఉండే అని అందరూ యాది చేసుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు జూకంటి ప్రభాకర్ రెడ్డి, పట్టణ యూత్ అధ్యక్షుడు భానుప్రసాద్, సీనియర్ నాయకులు హనుమాన్లు ,చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకకు హాజరైన పీసీసీ చీఫ్

నిజామాబాద్‌సిటీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ కుమారుడు జాహెద్ బిన్ తాహెర్ వివాహం నిజామాబాద్ నగరంలో ఆదివారం జరగగా.. వేడుకకు పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ హాజరయ్యారు. నగరంలోని భూమారెడ్డి కన్వెన్షన్‌హాల్‌లో జరిగిన రిసెప్షన్‌కు ఆయన హాజరై పెళ్లి కొడుకుకి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఉన్నారు.

గ్రామ ప్రజలకు సేవచేసే భాగ్యాన్ని కల్పించండి

● సర్పంచ్ అభ్యర్థి శోభా నర్సింలు యాదవ్



జంగంపల్లిలో ప్రచారం చేస్తున్న సర్పంచ్ అభ్యర్థి శోభా నర్సింలుయాదవ్

భిక్కనూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గ్రామప్రజలకు మరోమారు సేవ చేసే భాగ్యాన్ని కల్పించాలని మండలంలోని జంగంపల్లి గ్రామసర్పంచ్ స్వతంత్ర అభ్యర్థి మాడుగుల శోభా నర్సింలుయాదవ్ ఓటర్లను అభ్యర్థించారు. సర్పంచ్ ఎన్నికల్లో భాగంగా గ్రామంలో ఆదివారం ఇంటింటి ప్రచారాన్ని తన భర్త నర్సింలుయాదవ్, అనుచరులతో కలిసి నిర్వహించింది. గతంలో తన భర్త నర్సింలు యాదవ్ గ్రామసర్పంచ్‌గా గ్రామాన్ని అనేక విధాలుగా అభివృద్ధి చేశారని, మరోమారు సేవచేసే అవకాన్ని కల్పిస్తే గ్రామాన్ని జిల్లాలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని అన్నారు. ఈనెల 11న జరిగే సర్పంచ్ ఎన్నికల్లో బ్యాట్ గుర్తుకు ఓటు వేసి గ్రామ ప్రజలు తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. గ్రామం చుట్టూ ఉన్న ఫ్యాక్టరీలలో గ్రామయువతకు ఉద్యోగాల కల్పనతో పాటుగా ఫ్యాక్టరీల నుంచి దుర్వాసన రాకుండా కృషిచేస్తానని, కోతుల సమస్యను పరిష్కరిస్తానని అన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న దృశ్యం

కామారెడ్డి రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి పట్టణంలోని ఆర్.బీ.నగర్ కాలనీకి చెందిన రిషిత అనే విద్యార్థినికి ఆదివారం ఆర్థిక సహాయం అందజేశారు. సూపర్‌స్టార్ క్రిష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సినీనటుడు మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు రూ.12,116లు ఆర్థిక సహాయం అంజేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ విద్యార్థినికి తండ్రి సంజీవులు మృతిచెందడంతో కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విషయాన్ని తెలుసుకున్న ఫ్యాన్స్ అసోసియేషన్ వారు ప్రైవేట్‌స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న రిషితకు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మంజీరాలో ఈతకు వెళ్లి గురుకుల విద్యార్థి మృతి

(5వ పేజీ తరువాయి)

ప్రిన్సిపాల్‌కు సమాచారం అందజే శారు. విధి నిర్వహణలో ఉన్న ఇన్‌చార్జి ప్రిన్సి పాల్ గణపతి, డ్యూటీలో ఉన్న ఉపాధ్యాయిలు రవికాంత్, లక్ష్మణ్ అక్కడికి వెళ్లి చూడగా అజ య్ మృతి చెంది ఉన్నాడు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు, విద్యార్థి కుటుంబ సభ్యుల కు, పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు సంఘటన స్థలాన్ని నిజాంసాగర్ ఎస్సై శివకుమార్ సందర్శించి మృతదేహాన్ని పరిశీలిం చారు. మృతుడు అజయ్ బిచ్కుంద మండలం రాజాపూర్‌కు చెందిన విద్యార్థి. పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆసుపత్రికి చేరుకుని కుమారుడిని చూసి బోరు న విలపించారు. అజయ్ కుటుంబ సభ్యులు ఆందోళన చేస్తారన్న సమాచారంతో ముందస్తుగా పాఠశాల ప్రధాన గేటు వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అసలు విద్యార్థులు బయటకు వెళ్లడానికి అనుమతి తీసుకున్నారా లేదా అన్నది అంతుచిక్కడం లేదు. ఈ విషయాన్ని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, డ్యూటీ ఉపాధ్యాయులు రహస్యంగా ఉంచుతున్నారని ఆరోపణలు వినవస్తున్నాయి. తల్లిదండ్రులు రాకముందే అజయ్ మృతదేహాన్ని బాన్సువాడ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. అజయ్ మృతితో కళాశాల విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు.

సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డి

ధర్పల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా పాలన వచ్చి డిసెంబరు 7కు రెండు సంవత్సరాలు పూర్తయిందన్నారు. ఇదేరోజు తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేశారని ఆయన గుర్తు చేశారు. రెండేళ్ల కాలంలో ఎంతో అభివృద్ధి చేశామన్నారు. రూరల్ నియోజకవర్గం నుంచి ధర్పల్లికి అత్యధిక నిధులు కేటాయించామని ఆయన పేర్కొన్నారు. కల్యాణలక్ష్మి, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ ధర్పల్లి మండలంలోనే అత్యధికంగా పంపిణీ చేశామని ఆయన పేర్కొన్నారు. యువకులు చెడుదారి పట్టకుండా స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ కాలేజీని ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ పాఠశాలతో పాటు అగ్రికల్చర్ యూనివర్సిటీ, ఇంజనీరింగ్ తరగతులను ప్రారంభించామని ఆయన గుర్తు చేశారు. పార్టీలకు అతీతంగా ఎవరు వచ్చిన అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సంక్షేమ కార్యక్రమాలను అందించామని పేర్కొన్నారు. రెండు రోజుల పాటు జరిగే గ్లోబల్ సమ్మిట్‌లో రూ.3లక్షల పెట్టుబడులే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రణాళికలు రూపొందించారని ఆయన చెప్పారు. కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులను సర్పంచ్‌లుగా ఎన్నుకొని గ్రామాల అభివృద్ధికి మరింత చేయూతనందించాలని ఆయన పేర్కొన్నారు.

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70- ఆంధ్రా కింగ్ తాలుకా
ప్రియ 35- రాజు వెడ్స్ రాంబాయి
దర్శన్- జటదార

బాన్సువాడ

మహేశ్వరి ఆంధ్రాకింగ్ తాలూకా
వెంకటేశ్వర కలివివనం

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.140	రూ.170
స్కిన్	రూ.200	రూ.210
స్కిన్‌లెస్	రూ. 220	రూ.230